మిర్చికి తెగులు.. రైతుకు దిగులు

- చేతికొచ్చిన పంట చేజారిన వైనం
- వందల ఎకరాల్లో నష్టపోయిన అన్నదాతలు



తెగులు సోకి ఎండిపోయిన మిర్చి పంట

కురవి: మిర్చి పంట చేతికొచ్చే సమయంలో తెగులు సోకడంతో మిర్చి పంట పూర్తిగా ఎండిపోయి రైతులను దిగులుకుగురి చేసింది. మండలంలోని బలపాల గ్రామంలో రైతులు సాగు చేసిన మిర్చి పంటకు తెగులు(వైరస్) సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గ్రామంలో వందలాది ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగు చేశారు. సుమారు 50 మంది రైతులకు చెందిన మిర్చి తోటలకు వైరస్ సోకడంతో మిర్చి పంట చేతికొచ్చి సమయంలో ఎండిపోయింది. కొద్దిపాటిగా కాసిన కాయలన్నీ ఎండిపోయి తాలుగా మారాయి. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మిర్చి పంటకోసం చేసిన అప్పు లక్షల్లోకి వెళ్లింది. దీంతో రైతులు మిర్చి సాగుచేసి అప్పులపాలయ్యారు. గ్రామానికి చెందిన పిట్టల వెంకన్న, బాదావత్ శ్రీను, లగిశెట్టి వీరభద్రం, స్వామి, యలగం వెంకటేశ్వర్లు, భద్రమ్మ, రేపాకుల సైదులు, మొగిలిచర్ల నాగేశ్వర్‌రావు, శనగపురం వెంకన్న, లింగాయ, బి.వెంకన్న, బాదావత్‌రవి తదితరులు సాగు చేసిన మిర్చి పంటకు తెగులు సోకడంతో తీవ్రంగా నష్టపోయారు.

రూ.3లక్షల నష్టం



రెండు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ.3లక్షల పెట్టుబడి పెట్టాను. ఏపుగా పెరిగి కాయలు కాశాయి. దీంతో తోట బాగుందని అనుకున్నాను. తీరా పంట చేతికొచ్చే సమయంలోనే తెగులు సోకింది. దీంతో కాసిన కాయలన్నీ మాడిపోయి తాలుగా మారాయి.

– పిట్టల వెంకన్న, రైతు, బలపాల

పరిహారం చెల్లించాలి



మిర్చి పంటకు వైరస్ సోకి పంట పూర్తిగా ఎండిపోయింది. పంటకు పెట్టిన పెట్టుబడి పూర్తిగా పోయింది. పంట కోసం చేసిన అప్పు మిగిలింది. ప్రభుత్వం సర్వే చేసి తెగులుసోకిన మిర్చి పంటలకు పరిహారం చెల్లించాలి.

– బాదావత్ శ్రీను, రైతు, లక్ష్మీతండా

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



డోర్నకల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డోర్నకల్: ఆరు గ్యారంటీల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసన సభ్యుడు రాంచంద్రునాయక్ పేర్కొన్నాడు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన గ్రామ సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పూర్తయిందన్నారు. సహాయ వ్యవసాయ అధికారులు వ్యవసాయ పంటల మార్పు ప్రాధాన్యత, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై రైతులకు నిత్యం అవగాహన కల్పించాలని కోరారు. సర్పంచుల పదవీకాలం పొడగించాలని పలువురు సర్పంచులు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నాడు. కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు పొడిశెట్టి కమలారామనాథం, ఎంపీడీఓ చలపతిరావు, తహసీల్దార్ నాగభవాని పీఆర్ డీఈ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పలు సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ మండల ప్రతినిధులు తలారి విద్యాసాగర్, ఆంగోత్ బాబు, గుగులోత్ వీరన్న, సీతారాములు, ఉప్పలయ్య, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, సుమేర్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చిన్నగూడూరు: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని పగిడిపల్లిలో కొనసాగుతున్న పీపీఎల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానోత్సవం చేశారు. నాయకుడు రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్లబ్ సేవలు అభినందనీయం



గార్ల: ఆపదలో ఉండి అనారోగ్యం పాలై రక్తం అవసరం ఉన్న వారికి రక్తాన్ని అందిస్తూ రోగుల ప్రాణాలు నిలబెట్టేందుకు కృషి చేస్తున్న రెడ్ స్టార్ బ్లడ్ డోనార్స్ క్లబ్ సేవలు అభినందరనీయం అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రెడ్‌స్టార్ బ్లడ్ డోనార్స్ క్లబ్ 4వ వార్షికోత్సవం సందర్భంగా గార్లలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, నాయకులు కట్టెబోయిన శ్రీనివాసరావు, చింత కొండల్‌రావు, వంగూరి ప్రణయ్‌కృష్ణ, డప్పు శ్రీను, నరేష్, మహేష్, రాంబాబు, రణధీర్, సాయి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గోదారంగనాథుల కల్యాణం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామివారి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గుణనిధి ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు, తిరుప్పావై ప్రవచకులు శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకటరామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చాదర్ ఊరేగింపు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని కంకర బోర్డు నవజవాన్ కమిటీ ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గాలో సమర్పించే చాదర్ ఊరేగింపు పట్టణ నలుమూలల బ్యాండ్ వాయిద్యాలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫకీర్ ఆసిఫ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, జాఫర్ హుస్సేన్, యాకూబ్ పాల్గొన్నారు.

'బీజేపీది ద్వంద్వ వైఖరి'

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ద్వంద వైఖరి ప్రదర్శిస్తూ మాదిగలను మోసం చేస్తుందని ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్య అన్నారు. సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించి, ప్రస్తుతం కేంద్ర మంత్రులు వర్గీకరణ సాధ్యంకాదని చెప్పడం మాదిగలను మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో శ్రీను, రాధా, సతీష్, సత్యపాల్, ఎల్లయ్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడికి సన్మానం

డోర్నకల్: గ్యాంగ్‌స్టర్ గంగరాజు, జిన్నా సినిమాల దర్శకుడు ఇషాంత్ సూర్యను సోమవారం ఘనంగా సన్మానించారు. సూర్య డోర్నకల్ రాగా తన బాల్య మిత్రులు రాము, కోటేష్, శ్రీనివాస్, సంజయ్‌జైన్, రామాచారి, రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సమేర్‌చంద్‌జైన్ ఘనంగా సన్మానించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన క్యాలెండర్‌ను కాంగ్రెస్ నాయకుడు భిక్షపతి మంగళవారం ఆవిష్కరించాడు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శంతన్ రామరాజు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ సుభాని, ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమ పాల్గొన్నారు.

మకరజ్యోతి దర్శనం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి వారి దేవాలయంలో సోమవారం రాత్రి మకరజ్యోతి దర్శనం పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గద్దె రవి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.45 గంటలకు మకరజ్యోతి దర్శనం జరగగా, అనంతరం ఆలయ ప్రాంగణంలో హారతి కర్పూరంను వెలిగించారు.

సామూహిక పేరంటాలు



మహబూబాబాద్ రూరల్: కనుమ పండుగ సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఒకే వేదికపై మంగళవారం మహిళలు సామూహిక పేరంటాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బోనగిరి గోపిరత్నం, మంజువాణి, సుజాత, నాగమణి పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫెక్సీలను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సప్పిడి రంజిత్ అన్నారు. స్థానిక 17వ వార్డు పరిధిలోని పూలే జంక్షన్, రాజీవ్‌నగర్ కాలనీ రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈమేరకు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా..

- ఎమ్మెల్యే మురళీనాయక్



మల్లికార్జునస్వామి చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు దేవుడి గుట్టపై మూడు రోజులుగా జరుగుతున్న మల్లికార్జునస్వామి జాతరకు మంగళవారం మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి సందర్శించారు. జాతర కమిటీ పెద్దలు స్వాగతం పలికారు. దేవుడి గుట్ట కింద జాతర చివరి రోజు ఎల్లమ్మ కల్యాణం, బోనాల సమర్పణ వేడుకలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేతో కమిటీ పెద్దలు మల్లికార్జునస్వామి చిత్రపటాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. సీడీఎఫ్ నిధులతో ఆలయ నిర్మాణ, మౌళిక వసతుల ఏర్పాటు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అక్కడ నుంచి లైన్‌తండా గ్రామంలో సీతారామ యూత్ క్లబ్ నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే షీల్డులు అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్నయాదవ్, కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, ఎడ్ల నరేష్‌రెడ్డి, కలీల్‌పాషా పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర కమిటీ సమావేశం

మహబూబాబాద్ రూరల్: నేడు బుధవారం ఆదివాసి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశానికి మహబూబాబాద్ పార్లమెంటరీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని టీపీసీసీ సభ్యులు గుగులోతు దస్రునాయక్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దస్రునాయక్ మాట్లాడారు. సమావేశంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, ఎస్టీ సెల్ అర్బన్ అధ్యక్షుడు శంకర్ నాయక్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కోమల్ నాయక్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామానికి చెందినజోగి మహేష్ తన రెడ్‌మీ కంపెనీకి చెందిన ఫోన్ పోయిందని చేసిన ఫిర్యాదు మేరకు సీసీటీఎస్ సిబ్బంది కానిస్టేబుల్ స్వాతి, శ్రావణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్‌ను గుర్తించి స్వాధీన పర్చుకున్నట్లు సీఐ ఉపేదందర్‌రావు తెలిపాడు. మంగళవారం ఫోన్ బాధితుడికి అప్పగించినట్లు సీఐ తెలిపాడు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ఆటో, కారు ప్రమాద ఘటనలో బాధిత కుటుంబానికి చెందిన ఇస్లావత్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవరు స్థానంలో ఉన్న బాధావత్ తిరుపతిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ సీఐ బి.రమేష్ సోమవారం తెలిపాడు.

'భగీరథ' పనులు పూర్తి చేయాలి



భగీరథ ట్యాంకు పనులు పరిశీలిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్/మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాయిత్రి గుట్ట వద్ద నిర్మిస్తున్న మిషన్ భగీరథ 1500 కేఎల్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. వాటర్ స్టోరేజ్ మోటార్ల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లీకేజీలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏటిగడ్డ ఫిల్టబెడ్ మోటార్లను పరిశీలించాడు. కార్యక్రమంలో మున్సిపాల్ డీఈ ఉపేందర్, 13వ వార్డు కౌన్సిలర్ దండెబోయిన వెంకన్న, ఏఈ సురేష్, మిషన్ భగీరథ ఇంజనీర్లు రాజేష్, కృష్ణ, నీటి సరఫరా సిబ్బంది రాంచంద్రు, సురేష్ పాల్గొన్నారు.

సాగు జలాల కోసం సహకారం



సాగునీటి కాల్వను ప్రారంభిస్తున్న వెంకన్న

మరిపెడ రూరల్: సాగు జలాలకు ఓ వ్యక్తి సహకారం అందించి మానవత్వం చాటుకున్నాడు. కథనం ప్రకారం.. మరిపెడ మండలం దంటకుంట్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వాయిలకుంట (చెరువు)కు కాల్వ లేక ఎస్సారెస్పీ సాగు జలాలు రావడంలేదు. దీంతో చెరువులోని జలం అడుగంటుకొని పోయి దాని పారకం కింద ఉన్న రైతులు సాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో రైతుల విజ్ఞప్తి మేరకు అదే గ్రామానికి చెందిన రైతు భూక్య వెంకన్న ముందుకు వచ్చాడు. తన సొంత డబ్బులు వెచ్చించి ఎస్సారెస్పీ కాల్వ నుంచి వాయిలకుంట చెరువుకు సాగు జలాలు సరఫరా అయ్యేలా ఓ చిన్న సబ్ కాల్వను తవ్వించాడు. మంగళవారం రైతులతో కలిసి కాల్వను వెంకన్న ప్రారంభించాడు. వెంకన్నను పలువురు రైతులు అభినందించారు. కార్యక్రమంలో రైతులు పాండు, ప్రవీణ్‌నాయక్, రాందాస్, హరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన బాలరాజు

కేసముద్రం: ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టిన సంఘటన మండలంలోని కోరుకొండపల్లి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని రామన్నపేటకు చెందిన చంద్రగిరి బాలరాజు అనే వ్యక్తి, పనినిమిత్తం మహబూబాబాద్‌కు వెళ్లి, తిరిగి కేసముద్రం మీదుగా వరంగల్‌కు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో కేసముద్రంవిలేజ్, కోరుకొండపల్లి గ్రామాల మధ్య గల మలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బాలరాజు తలకు తీవ్రగాయాలు కావడంతో స్పృహకోల్పోయాడు. కాగా ఘటన స్థలానికి ఎస్సై వంశీధర్ చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించాడు. ఎస్సై క్షతగాత్రున్ని పోలీస్‌వాహనంలో తీసుకెళ్లి, ఎదురుగా వస్తున్న 108లో ఎక్కించి మానవత్వాన్ని చాటుకున్నాడు. అనంతరం అతన్ని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ముగ్గుల పోటీలు.. బహుమతుల ప్రదానం



మహబూబాబాద్ రూరల్: బహుమతులు అందజేస్తున్న అజయ్ సారథిరెడ్డి



గార్ల: బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సంక్రాంతి పండగ పురస్కరించుకొని సోమవారం ముగ్గులు, కబడ్డీ, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి ప్రజాప్రతినిధులు, నాయకులు నగదు బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్

ఊరూరా సంక్రాంతి సంబురాలు



డోర్నకల్: ముగ్గు వేస్తున్న యువతి



గార్ల: ముగ్గు వేస్తున్న యువతి



తొర్రూరులో..



గూడూరు: కొంగరగిద్దలో సంక్రాంతి సంబురాలు



మహబూబాబాద్ రూరల్‌లో బొమ్మల కొలువు..

జిల్లా వ్యాప్తంగా సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో రంగుల ముగ్గులు, గంగిరెద్దులు సందడి చేశాయి. పండుగను పురస్కరించుకుని రైళ్లు, బస్సులు రద్దీగా నడిచాయి. – సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

మున్నూరు కాపు పరపతి సంఘం కమిటీ ఎన్నిక

తొర్రూరు: మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కమిటీని మంగళవారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం డివిజన్ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. పరపతి సంఘం అధ్యక్షుడిగా కొమ్ము దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా మూల శేఖర్, కోశాధికారిగా సలుగు నర్సయ్యలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఆకుల పుల్లయ్య, మార్గం సంపత్, శివ, గోపి, సుకన్య, భాస్కర్, నవీన్‌లను ఎన్నుకున్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

కురవి: యాదవులు రాజకీయంగా ఎదగాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ అన్నారు. మంగళవారం సీరోలు మండల కేంద్రంలో మండలస్థాయి సమావేశం మండల అధ్యక్షుడు పెరుగు రాజుయాదవ్ అధ్యక్షతన జరిగింది. జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వంగ మధుయాదవవ్, నాయకులు నరేష్‌యాదవ్, వేణు, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఎదగాలి

మహబూబాబాద్ రూరల్: యవ్వనస్తులు క్రమశిక్షణ గల జీవితంతో ఎదగాలని రెవరెండ్ భీమాల అభిజిత్ అన్నారు. యవ్వనస్తుల ఆధ్యాత్మిక కూటముల సమావేశం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సమావేశంలో సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ బి.ధర్మయ్య, అన్నపూర్ణ అమ్మగారు, రెవరెండ్ జేమ్స్, సెక్రటరీ పీజే వివేకానంద, శ్రావణ్, రంజిత్ జాన్, సంజీవ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు మేలు

డోర్నకల్: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనులకు మేలు జరుగుతుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.విజయకాంత్ తెలిపారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, నాగన్న, శ్రీను, ప్రవీణ్, వినోద్, నర్సింహ పాల్గొన్నారు.

నామినేట్ పదవి ఇవ్వాలని వినతి

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న తనకు రాష్ట్రస్థాయిలో నామినేట్ పదవి ఇవ్వాలంటూ మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ మంగళవారం మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశాడు.

గడ్డివామి దగ్ధం

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామ శివారు కిష్టాపురంతండాలో సోమవారం అర్ధరాత్రి నిప్పంటుకుని 10ఎకరాల గడ్డివామికి దగ్ధమైంది. తండాకు చెందిన బానోతు ఉమ్లా, దేవ్‌సింగ్, భీమా అనే రైతులకు చెందిన సుమారు 10ఎకరాల గడ్డిని తండాలో గల బోడుపై ఉంచారు. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. సమాచారం మేరకు ఘటన స్థలానికి ఫైరింజన్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పంటించినట్లు బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

క్షుద్రపూజల కలకలం

మరిపెడ: మరిపెడ నుంచి సూర్యాపేటకు వెళ్లే జాతీయ రాహదారి జంక్షన్‌లో సుమారు బస్తా కొబ్బరికాయలు, నిమ్మకాయలు, గుమ్మడికాయలు, పసుపు, కుంకుమ ఇతర పూజలకు సామగ్రి ఉండడంతో అటుగా వెళ్లే వారు భయంతో వేరే దారి గుండా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

పరామర్శ..

మరిపెడ రూరల్: మండలంలోని కొత్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్లగడ్డతండాకు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బాదావత్ తావు (55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందగా, తండధర్మారం గ్రామానికి చెందిన కమలమ్మ (70), ఆనెపురం మాజీ సర్పంచ్ గుగులోతు చంద్రునాయక్ (75) ఇరువురు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు.

జార్జిరెడ్డికి నివాళి

గార్ల: ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమకారుడు జార్జిరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గార్ల మండల మద్దివంచ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల కార్యదర్శి మహేష్‌కుమార్, పవన్, ప్రసాద్, వినయ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నర్సింహులపేట: మండలంలోని నర్సింహులపేట గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి(48) అనే వ్యక్తి గడ్డి మందుతాగి చికిత్స పొందుతూ.. మంగళవారం మృతి చెందాడు. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం.. నర్సింహులపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి వంతడపల గ్రామంలో రెండేళ్లుగా కోళ్ల ఫారం పెట్టి అక్కడనే కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో జనవరి 3న శ్రీనివాస్‌రెడ్డి గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు కార్తిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతున్న చిన్నారి..

బయ్యారం : కూల్‌డ్రింక్ అనుకొని గడ్డిమందు తాగిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని కస్తూరినగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాదావత్ శ్రీను కుమారుడు సాయిచరణ్(9) ఈ నెల 4న ఇంట్లో ఉన్న గడ్డిమందును కూల్‌డ్రింక్ అనుకొని తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సాయిచరణ్ మంగళవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

కేసముద్రం: పంటభూమిలో బురదగొర్రు దున్నుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని బోడమంచ్యాతండా జీపీలో మంగళవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన బోడ నవీన్ దున్నుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌ను తాకడంతో ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో రైతుకు స్వల్పంగా షాక్ కొట్టడంతో అక్కడి నుంచి దూరంగా వెళ్లాడు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లికుదురు: మండలంలోని మేచరాజ్‌పల్లి గ్రామ జెడ్పీఎస్ఎస్‌కి చెందిన 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కార్తీక్, అరుణ్, వేణు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.